క్లుప్తంగా

స్వేచ్ఛాయుత ఎన్నికలకు పటిష్ట చర్యలు



మారికవలసలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ రామకృష్ణ

మధురవాడ: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్టు పీఎం పాలెం పోలీస్ ఇన్‌స్పెక్టర్ వై.రామకృష్ణ చెప్పారు. జీవీఎంసీ 5వ వార్డులోని మారికవలస, వైఎస్సార్‌కాలనీ, మారికవలస గ్రామం, తదితర ప్రాంతాల్లోని సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఆయన సబ్ ఇన్‌స్పెక్టర్ సునీతతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్న చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు భద్రత మరింత పెంచుతామని తెలిపారు.

గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు



బి.ఆర్.తాళ్లవలసలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాను పరిశీలిస్తున్న పోలీసులు

పద్మనాభం: ఎన్నికలు సందర్భంగా మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు సీఐ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. మద్ది, పాట్నూరు, గెద్దపేట, బి.ఆర్.తాళ్లవలస, చిన్నాపురం గ్రామాల్లో ఏర్పాటు చేశామన్నారు. కొవ్వాడ, పెంట, పాండ్రంగి గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇప్పటి వరకు 449 మందిపై బైండోవర్ కేసులు, బెల్టు షాపులు నిర్వహిస్తున్న 19 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. ఏడుగురు రౌడీషీటర్లను బైండోవర్ చేసినట్టు తెలిపారు.

ఆలయ కమిటీ చైర్మన్ నాగిరెడ్డి మృతి



సరగడ నాగిరెడ్డి (ఫైల్)

తగరపువలస : స్థానిక శ్రీరామ సత్యనారాయణ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ సరగడ నాగిరెడ్డి గుండెపోటుతో బుధవారం రాత్రి మృతి చెందారు. అర్ధరాత్రి గుండెల్లో మంటగా ఉందని చెప్పడంతో చుట్టుపక్కల వారు సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. నాగిరెడ్డికి భార్య పావని, కుమార్తెలు రమ్య, లావణ్య, తల్లి కనక ఉన్నారు. వైఎస్సార్‌సీపీ భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, నాయకులు నాగిరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించారు. గురువారం చిట్టివలస గోస్తనీనది తీరంలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

పీఎం పాలెం : స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పీఎం పాలెం 11 కేవీ ఫీడర్ ఏరియాలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. విజేత సూపర్ మార్కెట్ ఏరియా, హౌసింగ్ బోర్డు కాలనీ, సాంకేతిక ఇంజినీరింగ్ కాలేజీ ఏరియా, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, కార్ షెడ్ కూడలిలోని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన తెలిపారు.

ఆనందపురం : విద్యుత్ లైన్ల నిర్వహణ కోసం శుక్రవారం మండలంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. వెల్లంకి రూరల్, పారిశ్రామిక ప్రాంతం, బొద్దపాలెం సబ్ స్టేషన్ పరిధిలో పారిశ్రామిక ప్రాంతాలకు, గంభీరంలోని ఏపీఐఐసీ ప్రాంతాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకూ విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఈఈ పోలాకి శ్రీనివాసరావు కోరారు.

దగాకోరు టీడీపీని తరిమికొట్టండి

- ప్రజా క్షేమం కోరే వైఎస్సార్ సీపీని గెలిపించండి
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి



లొడగలవానిపాలెంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, చిత్రంలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు



బొత్స ఝాన్సీలక్ష్మికి, ఎమ్మెల్యే ముత్తంశెట్టికి గొర్రెపిల్లను బహూకరిస్తున్న నాయకులు

ఆనందపురం : సమాజంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని, దగాకోరు టీడీపీని తరిమికొట్టాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని పెద్దిపాలెం, లొడగలవానిపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారం ఒకేచోట కేంద్రీకృతమైతే ప్రజలకు సత్వర సేవలు అందవనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వికేంద్రీకరణ పద్ధతిలో సచివాలయాలు ఏర్పాటు చేసి వలంటీర్లను నియమించారన్నారు. దీంతో ఇంటి వద్దకే అన్ని రకాల సేవలు అందుతున్నాయని చెప్పారు. చంద్రబాబు నాయుడు మాత్రం వక్రబుద్ధితో వలంటీర్ వ్యవస్థను రాజకీయం చేసి దాన్ని రద్దు చేస్తానన్నారన్నారు. ప్రజల నుంచి తిరుగుబాటు రావడంతో ఆ వ్యవస్థ చాలా గొప్పదని, తాను వలంటీర్లకు రూ.10 వేలు వేతనం ఇచ్చి అండగా ఉంటానని చెప్పడం చంద్రబాబు చవకబారు ఎత్తుగడకు నిదర్శనమన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వ్యవస్థను ప్రవేశ పెడితే వారికి తాను వేతనాలు ఇస్తానని చెప్పడం బాబు అజ్ఞానానికి నిదర్శనమన్నారు. ప్రజలను అన్ని రకాలుగా వంచించిన చంద్రబాబు లాంటి వారికి అధికారం ఇస్తే ముఖ్యంగా ఉత్తరాంధ్ర తీవ్రంగా నష్టపోతుందన్నారు. విశాఖ రాజధాని అయితే ఎక్కువగా అభివృద్ధి చెందేది భీమిలి నియోజకవర్గమేనని చెప్పారు.

పరిపాలన రాజధానితో ఉద్యోగావకాశాలు

ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు పరుస్తున్న ఆరోగ్యశ్రీ పథకం పేదలకు సంజీవనిలా పనిచేస్తోందని చెప్పారు. రూ.25 లక్షలు వరకూ వైద్య సేవలను ఉచితంగా పొందే వెసులుబాటు దేశంలో ఎక్కడా లేదన్నారు. డ్వాక్రా సంఘాల రుణమాఫీ, సున్నా వడ్డీ రాయితీ, ఆసరా, చేయూత వంటి పథకాలతో మహిళలు ఎంతో అభివృద్ధి సాధించారని చెప్పారు. విశాఖ పరిపాలన రాజధాని అయితే సుమారు 150 శాఖల ప్రభుత్వ కార్యాలయాలు తరలి వస్తాయని, దీంతో ఉత్తరాంధ్ర ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. ఇలా ప్రజల బాగు కోరుతూ పాలన సాగిస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవడానికి భీమిలి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావుని, ఎంపీగా తనను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పెద్దిపాలెంలో బొత్స ఝాన్సీ లక్ష్మి జన్మదిన వేడుకలను నిర్వహించారు. లొడగలవానిపాలెంలో స్థానికులు వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు గొర్రె పిల్లను బహూకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మండల అధ్యక్షుడు బంక సత్యం, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, భీమిలి మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బోని అప్పలనాయుడు, పెద్దిపాలెం, లొడగలవానిపాలెం సర్పంచ్‌లు బావిశెట్టి పార్వతమ్మ, లొడగల రాజేశ్వరి, వైస్ ఎంపీపీ పాండ్రింకి శ్రీను, నాయకులు కూరాకుల వెంకటేష్, మరుపిళ్ల చిన్నయ్యపాత్రుడు, బంటుబిల్లి మణిశంకర నాయుడు, పాండ్రింకి అప్పారావు, రౌతు వెంకటరావు, గుండు నానాజీ, బొట్టా రామకృష్ణ, ఇల్లాపు వెంకటరావు, కోరాడ సూర్యారావు, షిణగం అప్పలరాజు, కోరాడ ముసిలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.



పెద్దిపాలెంలో కేక్ కట్‌చేస్తున్న ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి

పాఠశాలా..? పార్టీ కార్యాలయమా..?

- పద్మనాభం గోస్తనీ విద్యాపీఠ్ పాఠశాల ప్రాంగణంలో టీడీపీ కార్యాలయం



గోస్తనీ విద్యాపీఠ్ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయం

తగరపువలస : పద్మనాభం మండల కేంద్రంలోని గోస్తనీ విద్యాపీఠ్ పాఠశాల ప్రాంగణంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల, మసీదు, దేవాలయం, చర్చి వంటి ప్రాంగణాల్లో పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేయడం, పార్టీ పరంగా ప్రచారాలు చేయడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధం. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు గోస్తనీ విద్యాపీఠ్ లో కార్యాలయం ఏర్పాటు చేశారు. కార్యాలయం ముందు టీడీపీ జెండాలు ఏర్పాటు చేశారు. పాఠశాలలో పార్టీ కార్యాలయం ప్రారంభించి విద్యార్థులకు రాజకీయ రంగు పులుముతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత విద్యాశాఖ అధికారులు, ఎన్నికల కమిషన్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

దివీస్ ఉద్యోగులు 1110 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న దివీస్ ఉద్యోగులు

తగరపువలస: దివంగత దివీస్ జనరల్ మేనేజర్ సత్యచంద్ర దివి జ్ఞాపకార్థం గురువారం సంస్థలో ఏర్పాటు చేసిన శిబిరంలో 1110 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి రెడ్‌క్రాస్, ఏఎస్ రాజా, లైఫ్‌షేర్, న్యూలైఫ్, ఎన్టీఆర్, రోటరీ బ్లడ్ బ్యాంకు సిబ్బంది వీరి నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ శిబిరాన్ని డైరెక్టర్ ఎస్.దేవేంద్రరావు, వైస్ ప్రెసిడెంట్ ఎల్.వి.రమణ, జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యచంద్ర జ్ఞాపకార్థం ఏటా వెయ్యి మంది ఉద్యోగులు రక్తదానం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు రమేష్‌బాబు, రామకృష్ణ, పున్నారావు, సుబ్బారావు, డీజీఎం పి.ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే కృషి



మధురవాడలో మహాత్మా జ్యోతీరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ : సామాజిక సంఘ సంస్కర్త, అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతీరావు పూలేకి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం ఘనంగా నివాళులర్పించారు. పూలే జయంతిని పురస్కరించుకుని మధురవాడ కార్‌షెడ్ కూడలి సమీపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ పూలే అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారని కొనియాడారు. ఆయన భార్య సావిత్రిభాయి పూలే కూడా దేశంలో మహిళా విద్య కోసం విశేష కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ 5, 6, 7, 8 వార్డుల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు పోతిన హనుమంతురావు, బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, గుడ్ల పోలిరెడ్డి, వివిధ విభాగాల నాయకులు డాక్టర్ గాదే రోశిరెడ్డి, కుడితి రామారావు, సియాద్రి కనక రాజు, ఎస్.బాబ్జి, పెంద్ర అప్పన్న, పలివెల రవి, వంకాయల మారుతీ ప్రసాద్, పోతిన మూర్తిబాబు, పోతిన ఎల్లాజీ, పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిళ్లా సూరిబాబు, జగ్గుపిల్లి నరేష్, పీవీజీ అప్పారావు, బంగారు ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి జనసేన యువకులు



వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి యువకులను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: ఆనందపురం మండలం ముకుందపురం పంచాయతీ నుంచి గురువారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయంలో ఆయన సమక్షంలో పలువురు యువకులు జనసేన పార్టీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వీరిని ఎమ్మెల్యే ముత్తంశెట్టి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి... అందరికీ మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై అభిమానంతో వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్టు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చాలా అభివృద్ధి చేశారని, ఆయన గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీలో చేరుతున్న ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని, పార్టీ గెలుపు కోసం పని చేయాలని కోరారు. కోట రమణ, కోటరాజు, ఎన్ని కృష్ణ, మచ్చ ఆనంద్, నవీన్, సూరి నాయుడు, రాహుల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్



మసీద్ వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భీమునిపట్నం: భీమిలిలో గురువారం రంజాన్ పండగ భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.స్థానిక జామియా మసీద్ ఈద్గా మైదానంలో ఇమాం మహ్మద్ నసీం అక్తర్ ఆధ్వర్యంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. షేక్ అన్వర్ హుస్సేన్, షేక్ అబ్దుల్ నయీం , షేర్ అబ్దుల్ మతీన్, షేక్ అబ్దుల్ ఘనీ, మర్కియార్, షేక్ యాసిన్ పాల్గొన్నారు.

నిన్ను నమ్మం చంద్రబాబూ..

- వేతనం రూ.10 వేలు చెల్లిస్తామన్న బాబు హామీపై వలంటీర్ల మండిపాటు

తగరపువలస : కూటమి అధికారంలోకి వస్తే తమకు రూ.10 వేల వేతనం ఇస్తామంటున్న చంద్రబాబు మాటల్ని నమ్మబోమని భీమిలికి చెందిన వలంటీర్లు అంటున్నారు. ఇప్పటి వరకు తమపై చంద్రబాబు, పవన్ పలు ఆరోపణలు చేశారని... ఇప్పుడు రూట్ మార్చి వైఎస్సార్‌సీపీ ఇచ్చిన మొత్తం కంటే ఎక్కువ ఇస్తామని మభ్యపెట్టడం చంద్రబాబు రెండు నాల్కల ధోరణికి నిదర్శనమన్నారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు ఏ మేరకు నెరవేర్చారో చెప్పాలంటూ దుయ్యబట్టారు. ఏరు దాటాక తెప్ప తగలేసే రకాలను నమ్మమని మరోసారి చెప్పారు. దూషించిన నోటితోనే వలంటీర్లను పొగుడుతుండడం చూస్తుంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని అభినందిస్తున్నట్టే కదా అన్నారు. వలంటీర్లే కాకుండా రాష్ట్ర ప్రజలెవరూ చంద్రబాబు, పవన్ మాటలను విశ్వసించరన్నారు. ఇచ్చిన మాటలకు బ్రాండ్ అంబాసిడర్ అయిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటే వేదంగా ఓటర్లంతా ఆయనను మరోమారు ముఖ్యమంత్రిగా చూసేందుకు ఉవ్విళ్లూరుతున్నారన్నారు.

భూముల్ని కాజేశారు



తమ సామాజిక వర్గం బాగుకోసం రాజధాని పేరుతో అమాయక రైతుల నుంచి భూముల్ని చంద్రబాబు కాజేశారు. ఎలాంటి వనరులు లేని అమరావతిలో రాజధాని పేరుతో తనకు అనుకూలమైన సంస్థలకు వాటిని కట్టబెట్టారు. మళ్లీ గెలిచి అమరావతిని రాజధాని చేయడానికి ప్రయత్నిస్తున్నాడు.

– ఆర్.ప్రభాకర్‌నాయుడు, భీమిలి

ఆడపడుచులను చంద్రబాబు మోసం చేశారు



డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు రుణాలు మాఫీ చేస్తామని పచ్చి మోసం చేసింది చంద్రబాబు. బ్యాంకుల్లో ఉన్న బంగారం విడిపించి పసుపు – కుంకుమ నిలబెడతానని హామీ ఇచ్చి దారుణంగా మోసం చేశారు. మహిళలెవరూ ఆనాటి నెరవేర్చని హామీలను ఇంకా మరచిపోలేదు. ప్రతి మహిళకు సెల్‌ఫోన్ ఇస్తానని ఇవ్వలేదు.

– కొంకి వెంకటేష్, భీమిలి

రైతులను ఎగవేతదారులుగా చిత్రీకరించారు



ఈ భూమి మీద మాయా మర్మం తెలియని జీవి రైతు. అలాంటి వారికి కూడా రుణ మాఫీ చేస్తామని బాండ్లు ఇచ్చి డబ్బులు ఇవ్వకుండా మోసగించిన చరిత్ర చంద్రబాబుది. బ్యాంకుల దృష్టిలో రైతులను ఎగవేతదారులుగా నిలబెట్టింది నువ్వే కదా. ఇంటికో ఉద్యోగం ఇస్తానని నిరుద్యోగులను మోసం చేసింది గుర్తు చేసుకోవాలి.

– కొయ్య రామకృష్ణ, మూలకుద్దు

వైభవంగా అప్పన్నకు ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేసి 108 స్వర్ణ సంపెంగలతో పూజ నిర్వహించారు. ఆలయ ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజ స్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై అధిష్ఠంపజేశారు. పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

ప్రజలు సత్ప్రవర్తనతో మెలగాలి

పద్మనాభం: ప్రజలందరూ సత్ప్రవర్తనతో మెలగాలని నార్త్ ఏసీపీ సునీల్ సూచించారు. ఎన్నికల సందర్భంగా మండలంలోని పాట్నూరు, రెడ్డిపల్లి గ్రామాల్లో గురువారం రాత్రి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరూ అల్లర్లు సృష్టించవద్దన్నారు. అల్లర్లు సృష్టించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో బెల్టుషాపులు ఉండకూడదన్నారు. బెల్టుషాపులు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమాల్లో సీఐ సీహెచ్ శ్రీధర్, పోలీసులు పాల్గొన్నారు.

విస్తృతంగా వైఎస్సార్ సీపీ ప్రచారం



శివశక్తినగర్‌లో ప్రచారం చేస్తున్న పోతిన హనుమంతురావు, తదితరులు



7వ వార్డు వాంబేకాలనీలో కరపత్రం అందజేస్తున్న పోతిన శ్రీనివాసరావు, తదితరులు



జీవీఎంసీ 3వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



రిక్షా కాలనీలో కరపత్రం అందజేసి ఓటు అడుగుతున్న కార్పొరేటర్ ప్రియాంక, తదితరులు

మధురవాడ: మధురవాడ పరిధిలోని జీవీఎంసీ 5, 6, 7 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ పలువురు నాయకులు విస్తృతంగా నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారానికి విశేష ఆదరణ లభిస్తోంది. గురువారం సాయంత్రం నాయకులు కాలనీల్లో, నివాస ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బలపరచిన ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది రిక్షా కాలనీ పరిసర ప్రాంతాల్లో జీవీఎంసీ వైఎస్సార్‌సీపీ చీఫ్ విప్, కార్పొరేటర్ డాక్టర్ ముత్తంశెట్టి ప్రియాంక, నాయకులు శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో నాయకులు బొట్ట అప్పలరాజు, డాక్టర్ గాదే రోశిరెడ్డి, సియాద్రి కనకరాజు, యర్రా జోగారావు, నిడుగట్టు కొండమ్మ, మడక ఈశ్వరరావు, తిరుమల, ఎల్లాజీ, వాండ్రాసి సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 5వ వార్డు శివశక్తినగర్ పరిసర ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతిన హనుమంతురావు, 5వ వార్డు యువజన విభాగం అధ్యక్షుడు బగాది లక్ష్మణ, తదితరుల ఆధ్వర్యంలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. వివిధ విభాగాల నాయకులు పోతిన సురేష్ కుమార్, ఎస్.బాబ్జి, ముగడ రమణ, కూన రమణ, చింతాడ రామలక్ష్మి, తమ్మినేని శ్రీదేవి, రుషికేష్, బోయి సుజాత పాల్గొన్నారు.
- జీవీఎంసీ 7వ వార్డు వాంబే కాలనీలో ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ శ్రేణులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిళ్లా సూరిబాబు, కుడితి రామారావు, జగ్గుపిల్లి నరేష్, చేకూరి రజని, డాక్టర్ కాంతారావు, వేగి రామిరెడ్డి, పి.ఎల్లాజీ, సర్వత్ శ్రీను, దాసరి భాను, పసుపులేటి గోపి, నాయిని రాజు, మగ్గూరి వెంకటరావు, టి.సుబ్బు, వాసు, తారక్, కన్నం మంగమ్మ, డాక్టర్ సూర్యనారాయణ, పాల్గొన్నారు.

భీమునిపట్నం: జీవీఎంసీ 3వ వార్డు పరిధి మంగలవీధి ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు ఆధ్వర్యంలో గురువారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, బలహీన వర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారని, రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఆయన్ను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని మంచి మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. నాయకులు కదిరి ఎల్లాజీ, ఎ.సూర్యప్రకాశ్, జగ్గారావు, ఆర్.ప్రభాకర్‌నాయుడు, బూర నాగరాజు, ప్రగడ చంటి, పీతల శంకర్ పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం ఘనంగా త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో 36 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.